సృజన సాహిత్యం

మధ్య తరగతి మానవుడి జీవిత చిత్రం

'ఎలుకలు కొరికిన కథలు'

ఒక యాభయ్ ఏళ్ళ క్రితం తెలుగు మధ్యతరగతి జీవితం ఎలా ఉందో తెలుసుకోవాలంటే ఈ 'ఎలుకలు కొరికిన కథలు' ఒక విలువైన వనరు. తనికెళ్ళ భరణి ప్రముఖ నటుడు, నాటక రచయిత, ప్రయోక్త, దర్శకుడు. తన దర్శకత్వ ప్రతిభ, నటనా వైదుష్యం, సంభాషణల సొరు తెలుగు వారికి బాగా తెలుసు. కానీ వీటన్నిటినీ మించి తనొక గొప్ప భాషావేత్త అని ఈ కథలు చెప్పకనే చెపుతాయి. తన చేతిలో తెలుగు భాష ఎలా వొదిగి పోయిందో, ఎలా హొయలు పోయిందో, ఎన్ని చమత్కారాలు చిందించిందో, ఎన్ని శ్లేషలు కురిపించిందో తెలుసుకోవాలంటే ఈ కథలు చదివి తీరాలి.

మనకు శుక సప్తతి కథలు తెలుసు. ఒక చిలుక చెప్పిన డెబ్భయి కథలు. ఈ కథలు సంస్కృత సాహిత్యంలో ఒక భాగం. కొన్నిసార్లు వ్యంగ్యంగా, కొన్నిసార్లు ఉల్లాసంగా, చాలా సార్లు అసభ్యంగా ఉంటాయి ఈ కథలు. కానీ అన్ని కథలూ చాలా ఆసక్తికరంగా ఉంటాయి. మనలోపలికి మనలను చూసుకునేలా చేస్తాయి. నైతికత, అనైతికతల మధ్య వున్న సన్నని రేఖ మీద చేసే లీలా విన్యాసం శుక సప్తతి కథలు. తెలుగులో మనకు అమరావతి కథలు, దర్గామిట్ట కథలు, భట్టిప్రోలు కథలు ఇలా చాలా కథలు ఒక ప్రదేశాన్నో, ఒక వృత్తినో, మరొక ప్రవృత్తినో ఆధారం చేసుకుని రాసినవి వున్నాయి. ఆ కథల కోవలోకే వస్తాయి తనికెళ్ళ భరణి "ఎలుకలు కొరికిన కథలు". అయితే ఈ కథలు ఒక ప్రదేశాన్నో, ఒక వృత్తినో కాక, అటు ఉన్నత తరగతికి చెందక, ఇటు దిగువ తరగతికి చెందక మధ్యలో త్రిశంకు నరకంలో వేలాడే మధ్య తరగతిని ఆధారం చేసుకున్నాయి.

ఎప్పుడో అజ్ఞాన దశలో, ఔత్సాహికుడుగా రాసిన కథలు అని భరణి చెప్పుకున్నారు కానీ ఆ మాటలు నిజం కాదు. మొత్తం పధ్నాలుగు కథలూ, పధ్నాలుగు లోకాలలో పదికాలాల పాటు నిలిచే కథలు. భరణి, తన ప్రసంగాలలో అలవోకగా పద్యాలు చెప్పినట్టు ఈ కథలు అలవోకగా రాసినట్టు ఉంటాయి కానీ ఆ రూపంలో వెలువడటానికి తనను తాను పుటం పెట్టుకున్న తీరుమాత్రం అలవోకగా ఉండదు.

మామూలుగా ఏదైనా ఒక ఔషధాన్ని కనిపెట్టినప్పుడు అది సరిగా పనిచేస్తున్నదో, లేదో తెలుసుకోవడానికి క్లినికల్ ట్రయల్స్ వేయడానికి ఎలుకలను, పందులను ఎంపిక చేసుకుంటారు. ఆ ఔషధం తీసుకున్నాక ఆ ఎలుకలు భద్రంగా ఉంటే ఆ ఔషధాన్ని రోగులకు వాడటానికి అనుమతిస్తారు. ఆ తరహాలోనే ఈ కథలకు "ఎలుకలు కొరికిన కథలు" అని పేరుపెట్టి తన ప్రత్యేకతను చాటుకున్నారు భరణి. కొరికిన ఎలుకలు ఎలా ఉన్నాయో నాకు తెలియదు (బాగా వున్నాయి కనుకే ఈ పుస్తకం బయటికి వచ్చింది అనుకుంటా) కథలు చదివాక మనం మాత్రం మామూలుగా మౌనంగా ఉండలేము.

మానవ జీవితంలో ఎంత వేదన వున్నదో చెప్పడానికి చాప్లిన్ హాస్యాన్ని ఎన్నుకుంటే భరణి వ్యంగ్యాన్ని ఎన్నుకున్నాడు. హాస్యం నవ్వించి ఏడ్పిస్తుంది. వ్యంగ్యం పెదవుల మీదకు నవ్వును తెప్పిస్తూనే మెదడుకు మేత పెడుతుంది.

భరణి హైదరాబాద్ నామాలగుండు ప్రాంతంలో అద్దెకు వుంటున్నప్పుడు ఒక అనాకారి నల్లటి పిల్ల ఉండేదట. నల్లగా వున్నా ఆమె మొహం కళగా ఉండేదట. దాదాపు ఇరవయి అయిదు సార్లు పెళ్లి చూపులకు కూచున్న తరువాత ఆ అమ్మాయిలో ఒక నిర్వికారం, నిర్వేదం అలుముకున్నాయట. ఆ అమ్మాయిని దృష్టిలో పెట్టుకుని రాసిన కథ 'కనిపించని రాగం'. ఈ కథలో కూడా అంతే! శ్రీకాంత అనే అనాకారి నల్లపిల్లకి అనేకానేక పెళ్లి చూపుల తరువాత పెళ్లి అవుతుంది కృష్ణమూర్తితో. అది కూడా ప్రేమ పెళ్లి. అంత అనాకారిని ఎలా ప్రేమించాడు? పెళ్లిచేసుకున్నాడు కృష్ణమూర్తి? ఈ రహస్యాన్ని చివరి వాక్యంలో విప్పుతాడు రచయిత. కృష్ణమూర్తికి అందంతో పనిలేదు. ఎందుకంటే కృష్ణమూర్తి గుడ్డివాడు అని. రంగు మార్చే ఫెయిర్ అండ్ లవ్లీ క్రీమ్‌ల చుట్టూ జరిగే వ్యాపారాన్ని ఉద్దేశించి It is unfair and unlovely అంటారు భరణి.

"కుమాతా నభవతి" భరణిలోని లోచూపును పట్టి ఇచ్చే కథ. చెడ్డ బిడ్డ ఉంటుందేమో కానీ చెడ్డ తల్లి ఉండదు అని కదా ఆదిశంకరాచార్యుల వారు చెప్పింది. దారిద్ర్యం-నిత్యకృత్యం అయితే విలువలు మారిపోతాయి. అమ్మలు కూడా అబద్దాలు చెపుతారు. కన్న కొడుకులను మోసం చేస్తారు. ఆ తరువాత మోసం చేసినందుకు బతికివున్నంత కాలం ఏడుస్తారు. 'కుమాతా నభవతి'లో చివరకు కావమ్మ మొహం మీదకు దుప్పటి లాక్కుని విలవిలా ఏడుస్తుంది. సమాజం మీదకు దుప్పటి విసిరివేయలేకా, తనను తాను సమాజం నుండి దూరం చేసుకోలేకా..చెంపమీది కన్నీటి ధార బొంతలోకి ఇంకిపోతుంది. కానీ ఆ తల్లి గుండెల్లో దుఃఖం మాత్రం ఎప్పటికీ ఇంకిపోదు. చదివాక దేహమూ, ఆత్మా రెండూ దుఃఖపూరితం అవుతాయి.

భరణి సినిమా రంగంలోకి రాకముందే ఆ రంగంలోని పారసైట్స్ గురించి రాసిన కథ "క...స్ట్రీ...మా...పా...ద".క...స్ట్రీ...మా...పా...ద అంటే కథ, స్ట్రీన్ ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వం అని అర్థం. ఈ కథ చదువుతున్నప్పుడు ఈ కథలోని దర్శకరత్న దైవాధీనంలాంటి దర్శకరత్న మీకు గుర్తుకు వస్తే భరణికి బాధ్యత లేదు.

హీరోయిన్ శ్రావణ మంగళవారం నోము నోచుకుని సాయంత్రం వచ్చిన ముత్తయిదువులకు కాళ్లకు పసుపు రాస్తూ, శనగలు పంచుతుంటే, హీరో కిటికీలో నుండి చూస్తూ ఉంటాడు. ఆ సందర్భంలో హీరో, హీరోయిన్ లకు ఒక డ్యూయెట్ రాయమంటే విష్ణుశాస్త్రి అనే కవి ఒక పాట రాసి ఇస్తాడు. అప్పుడా దర్శకరత్న ఏమంటున్నాడో చూడండి. "ఏమిటా పాట? ఏదో మంగళ హారతి పాటలాగా! ఛా...ఛా...మీ చాదస్తం అంతా ఇందులో అఘోరిస్తే ఎలా అండి? ఏదండీ సెక్స్? ఏవీ రెండర్థాలు? ఊపు ఏది? పాటవింటే పిచ్చెక్కి పోవాలి. మీ పాట వింటే నీరసం వస్తోంది నీ.. రసం?" అని అరచి పెన్ను, పేపర్ లాక్కుని బరబరా రాసేస్తాడు పాటను దర్శరత్న. ఎలా:

శ్రావణ మంగళ వారం
శనగలు కారం కారం
పడుచు పిల్ల పసిడి ఉంగరం,
పొగరెక్కిన పచ్చి బొంగరం

ఈ సన్నివేశం చదువుతుంటే మీకు "కృష్ణా నడిబొడ్డులో, కావేరి తొలి పొద్దులో" అనే పాట గుర్తుకు వస్తే మీ తప్పేమీ లేదు. కృష్ణా నడిబొడ్డుకి కావేరి తొలి పొద్దుకి సంబంధం ఏమిటో ఆ కవికే తెలియాలి. 'సాగర సంగమం'లో కమలహాసన్ గీత పాట గుర్తొచ్చి, గుడి దగ్గర కమలహాసన్ నాట్యం చేసే సన్నివేశం గుర్తొస్తే కూడా భరణి తప్పు కూడా లేదు. సినిమా రంగానికి అవుట్ సైడర్ గా వున్నప్పుడే ఈ కథ రాసిన భరణి సినిమా రంగంలోకి వచ్చాక దాని లోటుపాట్లను ఔపోసన పట్టాక రాయాలి అనుకుంటే ఎన్ని అద్భుతమైన కథలు రాసేవాడో సినిమా రంగం మీద.

హైదరాబాద్ మత కల్లోలాల మీద విషోదయం, మధ్యతరగతి అంటే మరేమీ లేదు అన్నిటికీ అడ్జస్ట్ అయి పోయేవాడు అని చెప్పే పొయ్యిలో పిల్లి, గుడిపాటి వెంకటాచలం ప్రభావంతో రాసిన జూలీ లేచిపోయింది, మద్యానికి బానిస అయిన వాడు క్షణక్షణం చచ్చిపోయే వైనాన్ని విశదీకరించే ఇక్కడో ఆత్మహత్య జరుగుతున్నది, నక్కలలాంటి జిత్తులమారి స్నేహితుల గురించి చెప్పే నక్కలున్నాయి జాగ్రత్త, తొలిప్రేమను కాయితం పడవగా మార్చిన కాయితం పడవ ఇలా అన్ని కథలూ భరణి లోచూపును పట్టి యిస్తాయి.

కథకు శీర్షికను నిర్ణయించడంలో భరణిది ప్రత్యేకమైన పద్ధతి. మతకలహాల మీద రాసిన కథకి పెట్టిన పేరు 'విషోదయం'. తన వొంటి రంగు నలుపు కావడం చేత ఆత్మ న్యూనతకి లోనయి ఇంప్రూవర్ట్ గా మారిన ఒక నల్లపిల్లకీ, ఒక అంధ సంగీతకారుడికీ చిగురించిన ప్రేమకు పెట్టిన పేరు 'అవ్యక్త రాగం', ఆకలి తీరని మధ్య తరగతి కుటుంబానికి పెట్టిన పేరు 'పొయ్యిలో పిల్లి'.

రోజంతా ఆహారం లేక రాత్రిపూట కాసిని నీళ్లు తాగి పడుకున్న ఓ మనిషి కథకు సత్యం శంకరమంచి తన అమరావతి కథలలో పెట్టిన పేరు 'తులసి తీర్థం'. ఆ తులసి తీర్థానికి, ఈ పొయ్యిలో నుండి లేవని పిల్లికి ఎంత దగ్గర సారూప్యం వుంది. 'గ్రేట్ మెన్ థింక్స్ అలైక్' అంటే ఇదేనేమో. పొయ్యిలో పిల్లి ప్రారంభంలోనే ఇందులో వచ్చు పాత్రలు అనకుండా "ఇందులో నొచ్చు పాత్రలు" అంటాడు, మరణ శాసనంలో "ఇప్పుడెలా చావడం? విషం కూడా కల్తీనే ఎలా" అంటాడు. భాషతో చమత్కారం అంటే ఇది కాదూ!.

వ్యంగ్యం అనేది ఒక రకమైన గాఢులాంటిది. దానిలోకి చూసేవారు సాధారణంగా తమకు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి ముఖాన్ని



కనుగొంటారు, కానీ తమ స్వంత మొహాన్నే చూస్తారు అని జొనాథన్ స్విఫ్ట్ అంటారు. భరణి రాసిన ఈ కథలు చదువుతున్నప్పుడు మన చుట్టూ వున్న సమాజం మనకు అనివార్యంగా గుర్తుకొస్తుంది.

మన పక్క ఇంట్లోనో, మన ఎదురు ఇంట్లోనో వుండే కాయితం పడవ హీరోయిన్ శ్యామల గుర్తుకొస్తుంది. పరాన్న భుక్కు జోగారావును చూస్తే నిరుద్యోగంతో గిరీశాల్లా తయారయ్యే ఎందరో యువకులు గుర్తుకొస్తారు. కానీ వాళ్ళందరి వెనుకా వున్నది మనమే అనే విషయాన్ని మనకు తెలియకుండానే ఈ కథల ద్వారా భరణి మనలోకి ఇంజెక్ట్ చేస్తారు.

తనికెళ్ళ భరణి కథలు చదివితే ఒక మధ్య తరగతి మానవుడి జీవిత చిత్రం కళ్ళ ముందు తారాడుతుంది. ఆ పాత్రలలో మనమూ ఎక్కడో ఒక చోట మనలని కనుగొంటాము.

(ఇది గోదావరి ప్రచురణ. ప్రతుల కొరకు 95530 84268)

-వంశీకృష్ణ
95734 27422

మజ్జు

వేసవి కాలం
మన్ను తిన్న పాములా
మెల్లగా కదలాడుతుంది

రాజు వెడలే
రవితేజము అలరగా...
ఉదయమే గూడు చెదిరిన పక్షులు
కొన్ని ఆకాశ మార్గాన
ఆహారాన్వేషణకై లేబర్ అడ్డాకు
ఉపాధి కోసం తరలి వెళుతున్నాయి

చెట్టు నీడ లేక
అభివృద్ధికి ఎండ దెబ్బ తాకింది
రోడ్డుపక్క చలివేంద్రం
దయా దక్షిణ్యాలతో
జి.డి.పి.దాహం తీర్చుకుంటుంది

టీవీలో ఒకడు
ఒకటి...ఒకటి...ఒకటి...
రెండు...రెండు...రెండు...
మూడు...మూడు...మూడు ...

నారాయణ మంత్రం జపిస్తూ
చైతన్య రహితంగా
లొట్టి మీది కాకిలా అరుస్తూ
జైలు విద్యను హర్రాస్ మాల్ గా
వేలం పాట పాడుతున్నాడు

కోదండం ఎక్కించి
...కింద కార్పొరేట్ విద్య
ముళ్ళకంప మంట పెట్టి
శిక్షగా గోడకుర్చీ వేయించి
ఐసీయూలో సర్కార్ బడిని చేర్చించి
రోజూ హెల్త్ బుల్లెటిన్ విడుదల
చేయిస్తుంది

ప్రభుత్వం పాఠశాలను బడిబాట
పట్టిస్తుంది

విద్య వైద్యానికి
నాలుగు మెతుకుల రూకలు విదిల్చి
చేతులు రాని ప్రభుత్వాలు
సంక్షేమం ముసుగులో
ఐఎంఎఫ్ వరల్డ్ బ్యాంకుల ముంగిట
అప్పుల కోసం చెప్పులు అరిగేలా
తిప్పులు పడుతూ తిరుగుతుంటాయి

ప్రైవేటు కాలేజీలో అడ్మిషన్ తీసుకున్న
ఒంటరి గ్రామీణ విద్యార్థిలా
నగరం పడగాడ్పుల మధ్య
హోమ్ ల్యాండ్ సిక్ గుంజాటన
రంపము కోత బాధను అనుభవిస్తున్నాను

కుబుసం విడిచిన పాములా
తళతళ మెరిసిపోతూ
చస్తీ బతికితినంటూ ఎండ
ఒగరు కొడుతూ కూలర్ కిందనో
ఏ.సీ రూమ్ లోనో తలదాచుకుంటున్నది

పిట్ట పిలుపు కోసం
శిశిరంలో చెట్టు ముని పంటిన
కొంగు చివరను చాటు కోసం నొక్కి
పట్టుకొని
పచ్చని కాటన్ చీరను మార్చుకుంటున్నది

మధ్యాహ్నం తిని కునుకు తీసిన ఎండ
నిద్ర మబ్బు వదలక
మజ్జుగా కన్ను మూస్తూ తెరుస్తూ
తల్లి ప్రేమలా దీవించే
ఒక చల్లని వాన కోసం పగటి కల
కంటున్నది

-జూకంటి జగన్నాథం
94410 78095

ఆ నిమిషాలు క్షణికాలు కాదు

భలే ఉంటాయి కొన్ని క్షణాలు
పీటల మీద మెడ దించిన
వధువంచ అందంగా
పిట్ట పాటల గొట్టాల నుండి చొరబడ్డ
అజ్ఞాత సంగీతాలంత మెత్తగా
గోలీలాటలో చేతులు మారిన
పసి దృశ్యాలంత మృదువుగా

అవి మెదడంతా చెదిరినప్పుడు
పొట్టాల్లా దాచి ఉంటాను
ఫక్తు మనిషిని కనుక
అనుభవించి మర్చిపోవటం అలవాటని
మీరనుకొని ఉంటారు
అవి చిటారు కొమ్మల్లోని పతంగాలని
వెతికి తేవటం కుదరదని స్థిరపడి ఉంటారు

ఎవరన్నారో కానీ అనుభవాలు
ఎండు ద్రాక్షలని
అవి ఎముకల్లో మరింత బలపడి
రాలలేదని ఋజువు చేస్తాయి
పరిగల్లా చూసిన సంగతులు ఒక్కొక్కటీ
కపిరాజులా నిలబడినప్పుడు
అవిసెలు తిని పెరిగిన ప్రాణం కదా
నాకు మరపనేది లేదని గుర్తుకొస్తుంది

విసవిసల్ని దూరంగా విసిరి
జీవించే క్షణాలు వక్కల్లా నమిలినప్పుడు
ఏ మనిషైనా బతికే ఉంటాడు
మాటల్లో లేదంటే తలపుల్లో

- రఘు
96761 44904

నిర్వహణ : విల్సన్‌రావు కొమ్మవరపు
సాహితీ సంపాదకులు
k.wilsonrao@gmail.com

ఏడో రుతువు

అప్పుడే...అక్కడే...
కన్నుమూసి ఉంటే
అది ఒక భ్రూణహత్యా వార్త

ఇప్పుడు ఒక వాస్తవానివై
గొప్ప వర్తమానానివై
అబల అచ్చు తప్పనీ
సబల సరైందనీ నిరూపించావు

పదో తరగతిలోకి ప్రవేశించిన నీ పాదాలు
తమ్ముడు తోడు లేకుండానే
ట్యూషన్ కెళ్ళొస్తున్నాయి

ఓటు హక్కు వచ్చిన నీ ప్రాయం
వెంటనే పెళ్ళి పీటలు మీద కూచోకుండా
ఆఫీసు కుర్చీలో కూర్చుంటుంది

'పంటింటి కుందేలు' ని మాయమై
కమ్యూనిటి కిచెన్ పెళ్ళి కానుకగా వచ్చింది

నీ చేతిలో గరిటే కాదు
గాలి ఓడా గిర్రున తిరుగుతుంది

ఆకాశంలో సగం లాంటి
సరిహద్దు రేఖల్ని చెరిపేసి
మొత్తం ఇ ఎం ఐ లు నువ్వే కడుతున్నావు

సాఫ్ట్‌వేర్ జిలుగుల్లో
పుట్టినిల్లు మెట్టినిళ్ళ మధ్య
దూరాభారాల్ని తుడిచేస్తూ
ఆరళ్ళకి మంగళం పాడేశావు

ఏడురంగులూ కలిసి ఏకవర్ణమైనట్టు
ఆరు రుతువుల్నీ ఏకం చేసి
ఏడో రుతువును సృష్టించావు.

-డా. బండి సత్యనారాయణ,
విశాఖపట్నం,9989 03536.

అనువాద కలం వెలిగించిన మణిదీపాలు

'ఒకప్పుడు చెట్లు ఎగురుతూ ఉండేవేమో'

బుషి నారద సుబ్రహ్మణ్య వెంకటేశ్వరన్ అనువదించిన హిందీ అనువాద కవితల సంకలనం 'ఒకప్పుడు చెట్లు ఎగురుతూ ఉండేవేమో'చదివాక.. 'ఇప్పుడైతే, కవితలు వెలుగుతూ ఉన్నాయి' అని అనాలని ఉంది.అనువాద రచనల గురించి సాంకేతిక వివరాలు ఎన్నైనా చెప్పుకోవచ్చు. మూల భాషలో అభివ్యక్తి, పలుకుబడులు, భావంలో చిక్కదనం ఇలా ఎన్నో.

కానీ అసలు ఏ ఏ కవితలను, ఎందుకు అనువదించాలో పూర్తిగా అనువాదకుని ఎంపిక. బుషి నారద సుబ్రమణ్య వెంకటేశ్వరన్ అనువాద కవితా సంకలనం ఆ ఎంపికలో పరిణతిని తెలియచేస్తుంది. ప్రాంతీయ, సాంస్కృతిక, సామాజిక నిర్వచనాలన్నిటినీ దాటి, మౌలికమైన ఒక సద్భావనాలోకాన్ని చూసే హృదయ సౌందర్యం కావాలి. ఈ బృహత్ కార్యానికి ఒక తపస్సు చేయాలి. ఈ సంకలనంలో కవితలను ఎంచుకున్న విధానం వెంకటేశ్వరన్ గారి ధ్యాన స్థితిని, ఆరాధనాభావాన్ని తెలుపుతోంది. ఏదో ఒక ఇజం, వాదంలకు పరిమితమవక, వేర్పాటు, నిందారోపణలకు తావీయక హిందీ మూల భాషలోంచి.. మేలిమి కవితల్ని ఎంపిక చేసుకున్నారు.

ఈ కవులు దేశ స్వాతంత్ర్యానంతర కాలం వారు కొందరు. మరికొందరు ఆధునిక దృక్పథం కలవారు. ఉదాత్తమైన భావాలు, సరికొత్త పోలికలు, వచన కవితా నిర్మాణంలో వాస్తవికత ఉన్న కవితలు.శబ్ద ప్రధానంగా కాక, నూతన దృష్టితో సాగినవి ఎక్కువ. విశిష్టత గల కవితలు తెలుగు పాఠకలోకం ముందుంచడం నిస్సందేహంగా కొత్త ఒరవడి.

పూర్వ ప్రధాన మంత్రి శ్రీ అటల్ బిహారీ వాజపేయి కవిగా కూడా ప్రసిద్ధులు. వారి కవితల్లో.. "చుట్టుపక్కల ఎవరూ లేకుంటే తోడు/ నేనూ ఏడుస్తాను అప్పుడప్పుడు" అంటారు 'దూరంగా ఎవరో ఏడుస్తున్నారు' కవితలో (పే.15). 'వయసేమిటి గియసేమిటి?' కవిత(పే.16) లో "ఉప్పొంగే హృదయంతో జీవించు/ ముఖంపై ఉదాసీనత తొలగించు/ తరలిపోతూనే ఉంటుంది సమయం/ వయసేమిటి గియసేమిటి"..అంటూ పరస్పర విరుద్ధ భావాలు వెల్లడించిన రెండు కవితల్ని అనువదించి వాజపేయి వ్యక్తిత్వం, తాత్వికత రెంటినీ వెంకటేశ్వరన్ అందించారు.

'అనుజ్ లుగన్' అనే కవి రచించిన 'చందమామ ఆమె కోసం నిరీక్షిస్తున్న' వైనం తెలిపిన కవిత విభిన్నమైనది. ఒక స్త్రీ నిత్య శ్రామికురాలు. ఆమె రాత్రి నిద్రకి ఉపక్రమించే ముందు, తన అలంకారాలు తీసి పక్కన ఉంచాలి. అపుడు ఆకాశాన్ని అలంకరించి, తనను అలంకరించలేదంటూ చంద్రుడు ఆమెతో సంభాషించే కవిత ఒకటి ఉంది. ఈ కవితలో అంతరార్థాన్ని పాఠకుడు పలు విధాలుగా ఆవిష్కరించుకోవచ్చు.

కవి 'అనురాగ్ అనంత్'.. 'భావనాత్మక అసమర్థ ప్రదేశం' పదాలు సూచించే అస్తిత్వం ఒకరికి ఒకలా, వేరొకరికి మరోలా కనిపిస్తాయి. అక్షరాస్యత లేని అమ్మ , ఆరుగాలం కష్టించి పని చేసే రైతు, పాదరక్షలు చేసే చర్మకారుడు...వీరి కనులలోకి తొంగి చూసాక, పదాల పరిమితి మనుషుల నియతిపై పడి రోదిస్తున్నట్టు తోచింది అంటాడు కవి. ఈ నిశ్శబ్దం పాఠకుని చుట్టూ కమ్ముకుంటుంది.



అనురాధా సింగ్.. 'స్త్రీలకు ఈశ్వరుడు కాదు నిదుర కావాలి' అనే శీర్షికతో ఉన్న కవితలో 'మహిళలకు రోజువారీ చాకిరీ నుంచి కాస్తంత విరామం కావాల'ని చెప్పడం చీకటి గదిలో కొవ్వొత్తి వెలిగించినట్టే ఉంటుంది. ఔను, ఏ దేవుడూ అక్కర్లేదు, నిరంతరం తన చుట్టూ ఉన్న వారి బాగోగులను చూసుకునే మహిళా, నిజానికి నీకు నీదైన సమయం కావాలని ఎరుక కలుగచేస్తూ, ఇది చదివిన ఇతరులను సున్నితంగా నిలదీస్తుంది.

'అవధేశ్ కుమార్' పిచ్చుక, 'అహర్నిశ్ సాగర్' అమ్మ కవితలు ప్రత్యేకమైనవి.ఇంకా కొందరు మహిళల కవితలు భలే ఆకట్టుకుంటాయి.ఉదాహరణకి మీనాక్షి జిజీవిషా-'చుంబనం' (పే.81) ఈ చుంబనమే సృష్టికి నిరంతర అస్తిత్వమిస్తుంది/ అంటే చాలా తాజాగా ఉంటుంది!

కవి నీలోత్పల్ 'నేను పూర్తి ప్రపంచాన్ని పక్షుల కళ్ళతో చూస్తాను'..అంటే అసలా వాక్యంలో కొంగొత్త భావావిష్కరణ అనుభవైకవేద్యం తప్ప వివరణకు అతీతం.

నరేష్ సక్సేనా కవిత 'మంచి పిల్లలు' (పే. 62) చదివాక ఒక రోజంతా నిద్రపోలేం. ఎందుకంటే, అది..పది పంక్తుల సమ్మెట దెబ్బ! ఆ కవితలో 'కొందరు పిల్లలు చాలా మంచివాళ్ళు/వాళ్ళు బెలూన్లు, బంతులు అడుగరు/ మిఠాయి అడగరు, హఠం చేయరు/చిలిపి చేష్టలు అసలే చేయరు/ పెద్దలు చెప్పిన మాటలు వింటారు/చిన్న పిల్లలు చెప్పినవీ వింటారు/వారు అంత మంచివారు/ఇంత మంచివారి కోసం వెతుకుతుంటారు/దొరకగానే అలాంటి వారు నెలకు మూడొందల జీతానికి వెంటనే కుదుర్చుకుంటారు' అని సరళ సుందరంగా అనువాదం చేశారు వెంకటేశ్వరన్.

ఈ కవిత పిల్లల్ని పనికి పెట్టుకునేవారికి ఒక చెంపపెట్టు. వెంకటేశ్వరన్ గారికి ఈ కవులపై గల గౌరవం విషయసూచికలో కవితా శీర్షికలు కాక కవుల పేర్లు ఇవ్వడంతో తెలుస్తుంది.

ఈ సంపుటిలోనే 'లవ్లీ గోస్వామి'కవితల్లో కవిత్వ పరిభాష గురించి అసామాన్య ప్రతిభ గల కవిత ఒకటుంది.(పే.116). కవయిత్రి కవిత వ్రాయడం పూర్తి చేసినప్పుడు అమ్మ పాదాలను వేడినీటితో శుభ్రం చేసినట్టు ఉంటుందట!

'వందనా మిశ్రా', 'వివేక్ సౌరభ్', 'వినయ్ దుబే' ల కవితలు ఒక్కోటి ఒక్కో ఆణిముత్యం. వినోద్ కుమార్ శుక్లా కవితల్లో అపరిచిత వ్యక్తులతో కలిసే సందర్భాల్లో మనిషికీ మనిషికీ మధ్య అసంకల్పిత అనుబంధం ప్రాణవాయువులా, పైరగాలిలా, చల్లని వెన్నెల్లా అలముకుంటుందనీ,ఆ ఔన్నత్యం ఎన్నటికీ చెరగదనీ ఒక భరోసా వస్తుంది.అసలు కవులు కవిత్వం వ్రాసేది ఇందుకే కదా!

సప్నా భట్ 'ఏడ్పుతో, మృత్యువుతో సంభాషించిన తీరు, అందలి లోతు, నిరాశా నిస్పృహల నిస్సహాయత మనసును ముంచెత్తే సమయంలో చల్లని తడిబట్టతో ఆ అలసటనంతా తుడిచి సేద తీర్చినట్టు తోస్తుంది.

'రాజేష్ జోషి'ది ఒకరకమైన వైఖరి అయితే, 'పాయల్ భరద్వాజ్' ది నిలదీసి, నిగ్గదీసే వైఖరి. ఆమె అంటుందీ.. 'స్త్రీ పారిపోవడం/పద్దెనిమిదేళ్ల వయసులో నేను ఇంటి నుంచి పారిపోవాలనుకున్నాను/ ఇరవై ఒక్క ఏళ్ల వయసులో నగరం నుంచి/ఇరవై అయిదేళ్ల వయసులో సమాజం నుంచి/ ముప్పై ఏళ్ల వయసులో ఈ ప్రపంచం నుంచి/ పారిపోవాలనుకున్నాను/ముప్పై నాలుగేళ్ల వయసులో నానుంచి నేను పారిపోవాలనుకున్నాను/ కానీ అలా చేయలేక పోయాను/ ఎప్పటికీ చేయలేనని తెలుసును/ఎందుకంటే ఒక స్త్రీ పారిపోవడం "మహాభినిష్క్రమణం" అనరు మహాకళంకం అని పేర్కొంటారు'

సాధారణంగా పుస్తకాలు చదవడం ఇష్టమైతే ఒక కవి లేక రచయిత రచనలను వరుసగా చదువుతూ, వారి వ్యక్తిత్వాన్ని, జీవితానుభవాలను తెలుసుకోవడం పరిపాటి. వెంకటేశ్వరన్ గారి అనువాద కవిత్వ సంకలనం చదివిన తర్వాత కొందరు సమకాలీన కవుల వేర్వేరు ప్రపంచాలు, వారి దృక్కోణం ఒకేసారి కళ్ళెదుట కనబడతాయి.

కొండ శిఖరం చేరాక అప్పటి వరకు ఎక్కిన కొండ పాదాల కింద ఉంటే, కళ్ళు మాత్రం చుట్టూ లోయలు, దూరంగా పర్వత శ్రేణులు, ఆపై మరింత దూరంగా కొండ కొసల ఆనవాళ్లు చూసి అబ్బుర పడతాయి. ఆ తరువాత మబ్బులు, ఆ మబ్బుల వేర్వేరు ఆకృతులు చూసి సంబర పడతాయి. అసలైనది ఇంకా ఉంటుంది. అదే చిత్రంగా సూర్యుడో, జాబిల్లో విశాలంగా, చేతికి అందేట్టు కానవస్తాడు. ఆ క్షణం దాకా ఉన్న అల్ప భావనలన్నీ త్యజించి విశ్వ రహస్యమేదో తెలుసుకున్నట్టు మనసు ఆనందాశ్రువుల జడిలో తడిసిపోతుంది. ఈ అనువాద కవితా సంకలనం చదివితే పాఠకుడు అలాంటి అరుదైన క్షణాలను స్వయంగా అనుభూతించవచ్చు.

ఈ హిందీ కవులు లోకాన్ని, మనుషులను చూస్తున్న దృష్టి బహు విస్తృతమైనది. వారు ఎంచుకున్న అంశం, వ్రాసిన విధానం మంచి కవిత్వ లక్షణమైన సహజత్వంతో ఇంపుగా ఉన్నాయి. అణువణువునా మానవత్వం నింపుకున్నది.

మంచి కవిత చదివాక చాలాసేపు గొంతు పూడుకుపోతుంది.నిర్మాణం,నడక కన్న అందలి భావం కాసేపు గుండెను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. అలా చెప్పుకోవాలంటే ఈ సంకలనంలో ప్రతి కవితనూ ఉదహరించాలి.

కొన్ని కవితలలో వచనం మోతాదు ఎక్కువగా ఉంది. అది మూల కవితపై ఆధారపడే విషయం. కవి పేరుతో పాటు కవితా శీర్షిక ఇస్తే బాగుండేది.కవుల వివరాలు చెబితే బాగుండేది. కవిత్వం చదివే, వ్రాసే వారందరికీ ఈ సంకలనం ఆత్మీయ మిత్రుని లాంటిది.

-డాక్టర్ కాళ్ళకూరి శైలజ
98854 01882